# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 08-12-2015**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన గౌరవం, అన్ని పండుగలకు సమాన గుర్తింపు లభించాలన్నది తన అభిమతమని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బతుకమ్మ, బోనాలు, రంజాన్, గురునానక్ జయంతులు అధికారికంగా, ఘనంగా నిర్వహించామని, ఇప్పుడు క్రిస్మస్ వేడుకలను కూడా గొప్పగా జరపాలని సిఎం ఆదేశించారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సీనియర్ అధికారులు ఎకె ఖాన్, రేమండ్ పీటర్, ఉమర్ జలీల్, ఆధార్ సిన్హా, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యం, శాంతి వెల్లివిరియాలని, ప్రతీ ఒక్కరు ఆత్మగౌరవంతో బతకాలని సిఎం ఆకాంక్షించారు. అందుకోసమే అన్ని మతాల పండుగలను ప్రభుత్వ పండుగలుగానే గుర్తిస్తున్నామని వెల్లడించారు. ఎన్నో మతాలున్న భారతదేశంలో చాలా పండుగలు జరుగుతాయని, వాటన్నింటినీ ప్రజలు సంతోషంగా, వేడుకగా జరుపుకోవడం వల్ల ఎప్పుడూ మంచి వాతావరణం ఉంటుందని సిఎం అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని 195 కేంద్రాల్లో క్రిస్టియన్లకు డిసెంబర్ 16న దుస్తులు పంపిణీ చేయాలని, 19న క్రిస్మస్ విందు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 20న రాష్ట్ర ప్రభుత్వం తరుఫున హైదరాబాద్ నిజాం గ్రౌండ్స్ లో అధికారిక కార్యక్రమం ఏర్పాటు చేయాలని, దానికి తాను హాజరవుతానని వెల్లడించారు. క్రిస్టియన్ మత పెద్దలు, పాస్టర్లు, బిషప్ లను ఆహ్వానించాలని సూచించారు. క్రిస్టియన్ల అభ్యున్నతికి కృషి చేసిన ఐదుగురికి అవార్డులు కూడా ఇవ్వాలని నిర్ణయించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**